# బాంధవ్య పిపాసి

కృష్ణప్రియ



రజని హాస్పిటల్లో చేరి వారం రోజులువ్పైగా అయింది. ఆపరేషన్ ఏరోజు చేసేదీ ఇంకా డాక్టరు నిర్ధారణచేసి చెప్పలేదు. మందులు, ఇంజక్షన్లు ఇస్తున్నారు. బ్లడ్ టెస్టువగైరా అన్ని టెస్టులూ పూర్తిచేశారు. అంతా సక్రమంగానే ఉన్నది. కానీ రక్తంలో హిమోగ్లోబిన్ ఉండవలసినంతలేదనీ, రక్తం కూడా చాలినంతలేదనీ చెప్పారు. డాక్టరు మనోమోహిని రోజూ రొండుప్రకువచ్చి చాలా శ్రద్ధగా చూచివెళుతున్నది. కాని రజనికిమాత్రం జీవితంలో చరమ ఘడియలు ఆసన్నమైనవనే అనిపించేంది.

చావుబ్రతుకులను గురించిన చింతనే ఆమెకు ఎక్కువయింది. అసలు మనిషి జీవితమే అంతేనేమో! బ్రతుకు శరదృతువులోని వెన్నెలలాంటిది. మృత్యువు భయంకరమైంది. నల్లని నీడలాంటిది. అసలు చావనేది ఏమిటో, మనిషిని ఎలా కబళించివేస్తుందో కదా! చావు ఎక్కడినించి వస్తుంది? మనిషి చచ్చిపోయిన తరవాత ఏమవుతాడు? అతనిలోని ప్రాణం ఏమవుతుంది? ఇవన్నీ పాత ప్రశ్నలే! ఎందరో మహనీయులు వీటి జవాబులు వెతకాలని ప్రయత్నించారు. అంతా మామూలు కథే! విధాత నిర్ణయం ప్రకారం జీవిత చక్రం నడిచినన్నాళ్ళ నడుస్తుంది. కథ సమాప్తం కావలసిన నాడు, మానవ ప్రయత్నం ఏమీ పనికిరాదు! ఇదే చిరంతన సత్యం అనుకుంది రజని!

ఎండల తీవ్రత బాగా తగ్గిపోయింది. మృగశిర ప్రవేశించేసరికి కాలం చల్లబడింది. తొలకరి వానలు ప్రారంభమయినవి. ఉన్నట్లుండి జల్లులు పడుతున్నవి. "కాలేవర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ" అనే చిన్ననాటి శ్లోకం పదే పదే జ్ఞాపకం వచ్చేది రజనికి! ఏమీతోచక కిటికీలోనుంచి బయటికి చూసేది! అలాచూస్తే రోడ్డుమీది జనం కన్పిస్తారు. అందరు మహోల్లాసంగా ఎక్కడికో నడిచిపోతున్నారు. వీళ్ళందరికీ ఏం పనులో! రాక ఎక్కడినుంచో! టపటపా నెత్తిన చినుకులు పడుతున్నా లెక్కచేయకుండా, తడుసుకుంటూ వెళ్ళిపోతున్నారు! నిజంగా జవసత్వాలనేవి మనిషికెంత ఉల్లాసాన్నిస్తాయి!

రజనికా హాస్పిటల్ గదిలో రాత్రిళ్ళు పగళ్ళుగానూ పగళ్ళు రాత్రిళ్ళుగానూ సినిమాలో రీలులాగా తిరిగిపోతున్నవి. బంధువులు, మిత్రులు పలువురువచ్చి పలకరించి వెళుతున్నారు. డాక్టర్లు, రోగులు, నర్సులు. వాళ్ల దైనందిన జీవితం చూస్తుంటే అదొకప్రపంచం అనిపిస్తుంది. నిండు గర్భిణిగావచ్చి, సంతోషంగాపసికందును పొత్తిళ్లలో పొదివి పట్టుకుపోయేవాళ్ళు కొందరు. పట్టరాని దుఃఖంతో మృతకళేబరాలను తీసుకుపోయేవాళ్ళు మరి కొందరు. ఆశ, నిరాశల మధ్య, చావు బతుకుల మధ్య నిలిపించే రోగులు కొందరు!

❁ ❁ ❁

క్యాలెండరు జూన్ 27 వ తేదీ సూచిస్తున్నది. స్పెషల్ వార్డులోని 2 వ నెంబరు గదిలో అర్ధరాత్రి దాటినా ఇంకా లైటు వెలుగుతూనే ఉంది. పక్కరూములో మాటలు, మధ్య మధ్యలో నవ్వులు వినబడుతున్నవి. డ్యూటీ డాక్టర్లుకాబోలు ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ టిఫిన్లు తింటున్నారు. ఎదురుగాఉన్న "సి" వార్డులోని జనం గాఢనిద్రలో ఉన్నారు. 6 వ నంబరు మంచంమీద రోగి బాధగా మూలుగుతున్నది అగాధనిశ్శబ్దిలో అప్పుడప్పుడూ విన్పడుతున్నది. నైట్‌డ్యూటీ నర్సు బూట్లచప్పుడుమాత్రమే! బయట వానజల్లు పడుతున్నట్లుంది.

రజనికి కొద్దిగా కునుకుపట్టింది. వాళ్ల ఊరు అలా అలా రోడ్లన్నీ దాటి ఊరి చివరికి వచ్చింది. అక్కడొక మర్రిచెట్టు జడలు విప్పుకుని భయంకరంగా ఉంది. ఏదో శబ్దం. ఏదో పిలుపు. . . తననే పిలుస్తున్నది. . . రా. . రా అని చెయ్యిఊపుతున్నది. తా నింకా ఇంకా ముందుకు సాగిపోతున్నది. ఒంటరితనం . . . ఎవరూ తోడులేరు . . . ఎందుకు వెళుతున్నదో . . . ఎక్కడికి వెళుతున్నదో . . . ఆ పిలిచే దెవరో. .

అది శ్మశానవాటిక! అక్కడక్కడా నిప్పు! భయంకరమైన నిశ్శబ్దం. ఎక్కడినించో కీచురాళ్ళధ్వనులు. గాఢాంధకారం . . . ఇంతలో మనుషుల అలజడి... నలుగురు మనుషు లొక శవాన్ని మోసుకొచ్చారు. చితి అప్పటికే పేర్చబడి ఉంది. వెంట వచ్చిన ఆ అయిదో మనిషి, ఆ మృతకళేబరానికి నిప్పంటించాడు. అందరూ చూస్తూ దూరంగా నుంచున్నారు. 5 నిమిషాల్లో ఆ శరీరం భస్మీపటలమై పోయింది!

చచ్చిపోయిన మనిషి అంతే! రజనిని కూడా అలా ఎక్కడికో మోసుక పోతున్నారు. చితిపేరుస్తారు. అంతా మామూలే! అది భయంకరం. 'భరించలేను.

వచ్చి వద్దని చెప్పేస్తే ఆ పోటీ చెప్పినట్టు నాకింకా ఎంతో కాలం బతకాలని ఉంది.' "పడుకోలేదా?" అనే వార్డ్ నర్సు పిలుపుతో మెలకువ వచ్చింది రజనికి.

"ఏదో ఆలోచిస్తున్నారు. బాగా నిద్రపోండి. మీకు రెస్టు కావాలి" అంటున్నది నర్సు. నిద్ర? ఇంకెక్కడి నిద్ర! ముసురుకుంటున్న ఆలోచనలు రజనికి నిద్ర పట్టనిస్తేగా! ఎన్నో పీడకలలు . ఎన్నో ఆలోచనలు.

* * *

రజని ఆపరేషన్ జూన్ 30 వ తేదీన చేస్తారనీ, ఆ రోజు జరిగే ఆపరేషన్ల లిస్టు కూడా తయారు చేశారనీ చెప్పింది స్టాఫ్ నర్సు 28 వ తేదీన ముందుగానే ఆ విషయం తెలిసింది. ఇంకా రెండు రోజులు రెండంటే రెండే రోజులు. ఆ తరవాత తనకిక ఈ ప్రపంచంతో నిమిత్తం ఉండదు. మరో లోకానికి చేరిపోతుంది.

తన మంచి చెడుగులు, పాపపుణ్యాలు, తాను జీవితంలో ఆశించిందీ, అందుకోగలిగిందీ వేరేజు వేసుకో సాగింది రజని! తన ముప్ఫయి ఏళ్ల జీవితంలో ఎప్పుడూ ఎవ్వరికీ అపకారం తలపెట్టినట్టుగా జ్ఞాపకంరాలేదు. ఎవరైనా తన మనస్సును నొప్పించినా, మనస్సులోనే అణచుకుంది. ఇక జీవితంలో తానాశించిందీ పెద్దగా ఏంలేదు. ప్రతి మనిషి కోరతగిన వన్నీ తనకున్నాయి... ఇల్లూ, వాకిలీ, పండంటి సంసారం .. దేవుడి లాంటి భర్త .. కావలసినంత ఐశ్వర్యం, కాని ఏదో కావాలి! ఇంకేదో కావాలి! . . . ఎందుకో అసంతృప్తి! విర్లిప్తతాభావం! ఏదన్నా శ్రద్ధలేదు! మనస్సే మొద్దుబారిపోయింది! బ్రతుకుమీదే ఆసక్తి నశించిపోయింది. ఆమెలో గూడుకట్టుకుని కాపురం చేస్తున్న నిరాశ భావం ఆమెను సుఖంగా ఉండనీయలేదు. మొట్ట మొదటిసారిగా ఇప్పుడామెలో జీవించాలనే వాంఛ పైకి వచ్చింది.

ఎవరినించైనా సరే ఒక చిన్న చిరునవ్వు, ఒక్క చిన్న మాట ఇప్పుడు రజనికెంతో హాయినిస్తున్నవి. అందరూ తనకు అత్యంత సన్నిహితులుగా, విడిపోలేని ఆత్మీయులుగా కనపడుతున్నారు. జూన్ 29 వ తేదీ రానేవచ్చింది. పగలు పది గంటల వేళ! డాక్టర్ మనోమోహిని రౌండ్సుకి వచ్చింది ఆమె నిండైన మనిషి! మంచి అనుభవశాలిని. పేషెంట్సును ఒక్కొక్కరినే పలకరిస్తూ రజని గదిలోకి వచ్చింది. "రజని ఏమంటున్నది" అంటూ స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని లోపలికి వచ్చిన డాక్టరుకు దీనవదనంతో రజని ఎదురయింది.

"ఆదేం! అలా ఉన్నావ్! ఆపరేషనంటే భయపడుతున్నావా?" అంటూ భుజంతట్టి, చిరునవ్వు నవ్వుతూ మెరుపులా వెళ్లిపోయింది. కాని రజనికి ఎవరెన్ని చెప్పినా "చావు తప్పదు" అనే దృఢమైన నమ్మకం ఏర్పడిపోయింది. దానికితోడు స్టాఫ్ నర్సు "ఏదైనా జరిగితే హాస్పిటలు వారు బాధ్యులుకారు" అనే అంగీకార పత్రం గురించి చెప్పింది. ఇంక జీవించబోయేది ఒకే ఒక్క రోజు! 24 గంటలు! 30 వ తేదీ పది గంటలకల్లా ఆపరేషన్ జరిగిపోతుంది. మేజర్ ఆపరేషన్ అంటున్నారు. ఆపరేషన్ టేబిల్‌మీదే ప్రాణం పోవచ్చు. "మేం చేయగలిగిందంతా చేశాం. వెరీ సారీ" అనచ్చు డాక్టర్లు! అంతే! అంతటితో కథ సమాప్తం!

అనన్య సామాన్య ప్రచారంగల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక



అప్పుడిక అన్ని బంధాలూ, బాంధవ్యాలూ తెగిపోతవి. అమ్మ, అన్న, చెల్లి, భార్య, భర్త అనే బంధాలే పోతవి. . . ఎవరికి ఎవరూ కారు...

* * *

నిరామయంగా బెడ్‌మీద పడుకొని ఆలోచిస్తున్నది రజని! "నేను రజనీ! చూడు! కళ్ళు తెరు" ఎక్కడిదో చిరపరిచితమయిన కంఠం."

"నేనే! నేను రజనీ! మరిచిపోయావా?"

రాజేన్ గొంతు! ముందుకు వంగి రజని మొహంలో మొహంపెట్టి చూస్తున్నాడు. ప్రయాణంచేసి వచ్చాడేమో బాగా అలసిపోయినట్టున్నాడు. చెదరిన ముంగురులు చక్కని అతని ఫాలభాగం మీదపడి నాట్యం చేస్తున్నవి. చెయ్యెత్తి వాటిని సవరించాలనుకుంది రజని! కాని చెయ్యి లేవలేదు.

"ఎలా వచ్చావు? నీ కెలా తెలుసు?"

"దానికి జవాబుచెప్పాలంటే కావ్యరూపంలోచెప్పాలి? ఫక్కున నవ్వింది రజని.

"అయితే కావ్యరూపంలోనే చెప్పు"

"నీ కళ్ళల్లో ఉన్న రేఖలు నిజంగా కావ్యమే రాయిస్తాయి. నేను కావ్యం రాయగలిగిన నాడు నీకే అంకితం చేస్తాను తెలుసా?"

"నామీద నీకేం కోపంలేదా?"

". . ."

"జవాబు రాదా?"

"నీ మీదనా? నాకా? కోపమా?"

"ఏం రా కూడదా? రాగద్వేషాలనేవి నీకు లేవా?"

"ఊహూ! ఇంతేనా నీవు నన్నర్థం చేసుకుంది? నీ కెలా చెబితే నా మనస్సు అర్థమవుతుంది? నేను వీధి మానిసిని కానని నీకు తెలుసా? లాలస, ప్రలోభం అనే కళ్ళతో చూస్తే, నే నెలా కన్పడతానో నాకే తెలియదు! రజనీ! ఇలా చూడు! మానవ జీవితం కొన్ని సూత్రాలమీద ఆధారపడి నడుస్తుంది. అందరూ వాటికి దాసోహ మనవలసిందే!"

"ఓ పెద్ద వేదాంతిలా మాట్లాడుతున్నావే" కిలకిలా నవ్వింది రజని! "ఈ నవ్వు, సరిగ్గా ఇప్పుడు నవ్వావే ఈ నవ్వు, ఎప్పుడూ నా గుండెల్లో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది."

కొన్ని దేశకాల పరిస్థితులు, కొందరి జీవితాల్లో అపూర్వసంఘటనలను, అనుకోని సంక్షోభాలను తెచ్చిపెడతవి 11 సంవత్సరాల క్రితం రజని తండ్రి బీహారు రాష్ట్రంలోని రాంచీలో ఇంజనీరుగా ఉండేవారు! రజనికి ప్రపంచం అప్పుడప్పుడే అర్థమవుతున్నది. ప్రతిచిన్న సంఘటన ఆమెలో కదలికను, మధురభావాలను కలిగించే రోజులు. రాజేన్ తండ్రిగారిది జంషెడ్పూరు. వారి పూర్వులు ఆంధ్రులే అయినా ఉద్యోగరీత్యా జంషెడ్పూర్ వెళ్ళి అక్కడే స్థిరపడిపోయినాడు. రాజేన్ పెద్దన్న రమాకాంతరావుగారు రాంచీలో ఉద్యోగం చేస్తున్నారు. షాలిమార్ మార్కెటు సమీపంలో క్వార్టర్సులో ఉండేవాళ్ళు. రజని వాళ్ళ ఇంటికి కుడిప్రక్కవాటాలోదినేష్‌సింగ్ అనే యు.పి. నివాసి ఉండేవాడు. ఆయన కొడుకు హర్షవర్ధన్. ఎడమవైపువాటాలో ప్రఫుల్లచంద్రరాయ్ అనే బెంగాలీ ఉండేవాడు. ఆయన కూతురు ప్రతిభ! అందరూ ఎంతో పరిచయంగా ఉండేవాళ్ళు.

రాంచీలోని ఆంధ్రులంతా చేరి ఆ సంవత్సరం ఉగాది వేడుకలు జరిపారు. రజని సంగీతజ్ఞానం కలిగినది కాబట్టి ఆమెను పాటలు పాడమన్నారు. అన్ని జాతులవారినీ కలిపి ఒక ఆర్కెస్ట్రా తయారు చేశారు. అందులో రాజేన్ ఫ్లూట్ వాయించడానికి వచ్చాడు. అతనిని మొట్టమొదటిసారి చూసింది రిహార్సలులోనే ! రజనికి అతనంటే చెప్పలేని అభిమానం ఏర్పడింది. మెత్తగా, మృదువుగా మాట్లాడేవాడు. పిక్నిక్‌లకూ, సినిమాలకూ రాజేన్, హర్షవర్ధన్, అతని చెల్లెలు రేణు, ప్రభ కలిసివెళ్ళటం పరిపాటయింది ఒకసారి "నేదర్‌హాట్" పిక్నిక్‌కు వెళ్ళారు. అందరూ అక్కడ సూర్యాస్తమయం, సూర్యోదయం చూడటానికే వెళ్ళారు. తలొకచోటా కూచొని ప్రకృతి శోభను తిలకిస్తున్నారు. ప్రచండ భానుడు తన రథాలను పశ్చిమాద్రికి మళ్ళిస్తుంటే తదేకంగాచూస్తుంది రజని. ఎప్పుడు వచ్చాడో ఆమె పక్కన కూర్చున్నాడు రాజేన్! "దేవిగారి తపస్సుకు భంగం కలిగిందా?"

తుళ్ళిపడి లేచింది రజని!

"లేచావేం! కూచో."

"నీవు" అనే ఏకవచన ప్రయోగం, ఆమెలో ఏవో భావాలు రేపింది. రాజేన్ తనను సన్నిహితురాలుగా భావిస్తున్నాడా?

"ఈ సంధ్యాసమయం, ఈ వినీలాకాశం, ఈ మందమారుతం . . ."

"కవిత్వం వస్తున్నదా?"

"మనస్సు ఆనందంతో నిండిపోతే కవిత్వంవస్తుంది. నా కెన్ని ఊహలు వస్తున్నవో ఎలా చెప్పేది?"

"ఏం ఊహాసుందరి సాక్షాత్కరించిందా?"

"అవును కన్పించింది. ఆమె అందరిలాంటి మనిషి కాదు. హృదయంతో పలకరిస్తుంది. కళ్ళతో కథలు చెబుతుంది."

"ఆమెను ప్రేమించావా?"

"దానికేపేరైనా పెట్టు. ఆమె నా ప్రాణం. నా జీవం. నా సర్వస్వం."

"ఏం! ఆమెను చూడాలని ఉందా? సూటిగా నా కంటిపాపల్లోకి చూడు కనపడుతుంది" విస్తుపోయి చూస్తున్న రజనిచేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు రాజేన్! అర్ధనిమీలిత నేత్రాలతో అతని వక్షస్థలంమీద వాలిపోయింది రజని!

ఆ తరవాత కొద్దిరోజులకే రజని వాళ్ళ కుటుంబం రాంచీనుంచి వెళ్ళిపోవటం జరిగింది. రేణుద్వారా రాజేన్ మిలిటరీలో చేరాడనీ, పూనాలో ఫ్లయింగ్ ఆఫీసరుగా ఉన్నాడనీ తెలిసింది. అంతే! మరి చూడలేదు! అతనిని గూర్చిన భావం, ఎంతటి సాంత్వన, ఎంతటిమాధుర్యం ఆమెలో కన్పిస్తవో! అతని రూపం ఆమె హృదయంపై ఒక చెరగని ముద్ర వేసింది. అతని స్మృతిలో, ఎన్ని జన్మల నయినా ఎత్తగలదు. ఆ పవిత్రభావం, లోకాలను జయించే శక్తి నిస్తుంది.

ఈ లోకాలను, సూర్యచంద్రులను, దివారాత్రాలను, మనువులనూ, మన్వంతరాలనూ, సకల చరాచర జీవజంతువులనూ సృష్టించిన మహాశక్తి, మనిషిలో ఎందుకు ఇంత బాంధవ్య పిపాస సృష్టించినట్లో! ఈ పిపాసతోనే మనిషి బతుకుతాడు. చావడు. తన ఊరితో బాంధవ్యం! తన వారితో బాంధవ్యం! మానవ జీవితానికి మూలసూత్రం ఇదేనేమో! యుద్ధాలు వస్తవి! మహా సంక్షోభాలు వస్తవి. కరువులు వస్తవి. వరదలు వస్తవి. ఎన్నో రోజులు ఎంతో అసంతృప్తితో జీవించవలసి వస్తుంది. కాని మనిషి చావడు. బతికేఉంటాడు.

అంతా కల. భ్రమ! 'రాజేన్ ఇప్పుడెక్కడున్నావో! ఏంచేస్తున్నావో! రేపటితో నా జీవితం అంతం కాబోతున్నది. నీవు హాయిగా ఉండాలని మనసారా కోరుతున్నాను. మరో జన్మ అనేది ఉంటే మళ్ళీ కలుసుకుందాం.' జొటజొటా కన్నీళ్ళు కారిపోతుంటే రజని తల్లి తట్టి లేపింది.

* * *

జూన్ 30 తెల్లవారింది. 10 గంటలకల్లా స్ట్రెచర్ మీద ఆపరేషన్ థియేటరులోకి తీసుకపోయినారు. స్టాప్ అంతా అప్పటికే థియేటర్‌లో రెడీగా ఉన్నారు. టేబుల్‌మీద పడుకోబెట్టారు. అనస్థీషియా ఇచ్చే డాక్టరు తనవైపు వచ్చి నాడి పరీక్ష చేస్తున్నాడు. బి.పి ఆపరేటస్ చేతికి తగిలించారు. పోస్టుగ్రాడ్యుయేట్లు, హౌస్ సర్జన్లు, అసిస్టెంట్సు ఆప్రన్లు తగిలించుకుని థియేటర్‌లోకి వచ్చారు. సెలైన్ వాటర్ రెడీగా ఉంచారు. "బ్లడ్ బ్యాంకునించి బ్లడ్ తెప్పించారా" అంటూ డాక్టరు మనోమోహిని లోనికి వచ్చింది.

"చీఫ్ వచ్చారు. గెట్ రెడీ" అంటున్నాడు అనస్థీషియా డాక్టరు. గది, అందులోని టేబిలు, అక్కడున్న మనుష్యులూ అంతా గిరగిరా తిరిగిపోసాగారు. ఆపైన అంతా అయోమయం.

ఏదో అజ్ఞాతమైన కంఠం. "నీలోని జీవించాలనే కాంక్ష ఎల్లప్పుడూ జీవించే ఉంటుంది. నీకు చావులేదు. బతుకుతావు. నీవు చిరంజీవివి" అంటున్నది. చెవులు గింగురుమంటున్నాయి. దూరాన ఉన్న దేవాలయంలోని గంటలు కాబోలు టంగ్ టంగ్‌న మోగుతున్నాయ్!

భద్రతకు రక్షణకు
50 షాట్ల మడత పిస్టల్

లైసెన్సు అక్కరలేదు. అమెరికన్ మోడల్. దొంగలు, అడవి జంతువులనుంచి మిమ్ము రక్షించుకొనండి. వనభోజనాలకు, ప్రయాణాలకు, నాటకాలకు ఉపయోగమైనది.



50 షాట్ల ఏర్పాటుతో దానంతట అది పని చేస్తుంది. తేలికైనది. మిరుమిట్లు గొలిపే దీని మంట మిమ్ము ప్రమాదం నుంచి కాపాడుతుంది. 50 షాట్లతో జర్మన్ మాడల్ నం. 99 వెల రు. 15-50. వి.పి.పి. చార్జీలు రు. 2-50. తోలుకేసు రు. 3—50. అదనపు షాట్లు నూరు రు. 5/—లు. మిలిటరీ జవాన్లకు, ఆఫీసర్లకు ప్రత్యేక తగ్గింపులు.

ATLAS CO. ( —16).
P.O. Box 1329, Delhi-6.